
# మద్రాసు హైకోర్టు రగడ ముందూ వెనకా

**కె. బాలగోపాల్**

ఫిబ్రవరి 19న మద్రాసు హైకోర్టులో జరిగిన రగడ ఒక రకంగా మేలుచేసింది. శ్రీలంకలోని పరిస్థితి గురించి మనకు ఉండవలసీ లేకుండాపోయిన ఆసక్తిని రగిల్చింది. నిజానికి శ్రీలంక పరిస్థితి గురించి అవగాహన లేకపోతే మద్రాసు హైకోర్టు గొడవ అర్థం కాదు. అది లేకనే, సుప్రీం కోర్టు విచారణ జరుపమని నియమించిన జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ రెండేరెండు రోజులలో ఒక మధ్యంతర నివేదిక ఇచ్చేసి అందులో తప్పు ప్రధానంగా లాయర్లదేననగలిగారు. ఆయన న్యాయబుద్ధిగలవాడు, పక్షపాతరహితుడు అంటూ ఆయన నియామకాన్ని స్వాగతించిన మద్రాసు న్యాయవాదులు కంగు తిన్నారు.

2006 తరువాత క్రమంగా తన దేశానికి చెందిన మీడియాను, మానవ హక్కుల కార్యకర్తలనూ తమిళ ప్రాంతమైన వన్నికి పోనివ్వకుండ నిరోధించిన శ్రీలంక ప్రభుత్వం అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న హ్యూమన్ రైట్స్ వాచ్‌ను మాత్రం పోనివ్వక తప్పలేదు. వారిని కూడ పోనివ్వకపోతే అంతర్జాతీయంగా పరువు పోతుందని భయపడ్డారేమో తెలియదు. ఆ సంస్థ డిసెంబర్‌లో ఒకటి, ఫిబ్రవరిలో ఒకటి రెండు వివరమైన నివేదికలు విడుదల చేసింది. ఎల్‌టిటిఇతో ఉండిపోయి దేశ ఈశాన్య తీరంలో చిక్కుకుపోయిన రెండున్నర లేక మూడు లక్షల తమిళ ప్రజానీకానికి తిండి లేదు, నీళ్ల లేవు, వైద్యం లేదు, ఆస్పత్రులలో సహితం భద్రత లేదు అనేది ఈ నివేదికల సారాంశం. కిలినోచ్చితో మొదలుపెట్టి ఎల్‌టిటిఇని వెనక్కి తరిమిన క్రమంలో శ్రీలంక సైన్యం నిరాయుధులైన పౌరుల పైన గుండ్ల వర్షాలు అనేక పర్యాయాలు కురిపించిందని సోదాహరణంగా ఈ నివేదికలు తెలుపుతాయి. ఫిబ్రవరి నెల మధ్య భాగం నాటికి 5150 మంది పౌరులు తీవ్రంగా గాయపడ్డారనీ అందులో 1123 మంది చనిపోయారనీ తెలుపుతాయి. ప్రస్తుతం ఈ సంఖ్యలు 7000, 2000కు చేరుకున్నాయని ఒక అంచనా. ఆస్పత్రుల మీద గుండ్ల వర్షం కురిపించిన ఘటనలను తేదీలతో సహా ఈ నివేదికలలో ఇచ్చారు. ముల్లైత్తీవు జనరల్ ఆస్పత్రి పైన డిసెంబర్ 15, 19, 20 తారీఖులలో, వడ్డకచ్చి ఆస్పత్రిపైన డిసెంబర్ 17 తారీఖు నాడు, కిలినోచ్చి జనరల్ ఆస్పత్రిపైన డిసెంబర్ 22, 30 తేదీలలో, వల్లిపురం ఆస్పత్రిపైన ఈ సంవత్సరం జనవరి 19, 21, 22 తారీఖులలో, పుట్టుక్కుదియురిప్పు ఆస్పత్రిపైన అత్యధికంగా జనవరి 10, 13, 31, ఫిబ్రవరి 2, 3,5, 10 తారీఖులలో మందుగుండ్లు కురిపించింది శ్రీలంక సైన్యం.

ఎల్‌టిటిఇ అదుపులో ఉన్న 'యుద్ధ ప్రాంతం' నుంచి తమిళులను బయటకు రమ్మని శ్రీలంక ప్రభుత్వం ఆహ్వానిస్తున్నది. కొన్ని సురక్షిత ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎటువంటి ప్రాణాపాయమూ ఉండదని హామీ ఇస్తున్నది. కానీ అక్కడ కూడ ప్రజలకు సైన్యం దాడులు తప్పడం లేదు. ఉదాహరణకు ఎ 35 జాతీయ రహదారి పక్కన ఉన్న 35 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల ప్రాంతాన్ని జనవరి 21న శ్రీలంక సైన్యం సురక్షిత ప్రాంతంగా ప్రకటించి కరపత్రాలు అచ్చువేసి పంచగా చాలామంది తమిళులు అక్కడ చేరారు. అక్కడున్న ఒక స్కూలు ఆటస్థలంలో ఎక్కువ మంది గుమిగూడారు. అదే భోజనం పొట్లాల సరఫరా కేంద్రం కూడ. జనవరి 22, 23, 24 తేదీలలో ఈ ఆటస్థలం మీద, దాని చుట్టు పక్కల శ్రీలంక సైన్యం విచ్చలవిడిగా తూటాలు కురిపించగా 30 మంది పౌరులు చనిపోయారు. పక్కనే ఉన్న ఐక్యరాజ్యసమితి సిబ్బంది కార్యాలయం మీద 24, 25 తేదీలలో శ్రీలంక సైన్యం కురిపించిన గుండ్ల వర్షంలో మరొక 9 మంది చనిపోయారు.



ఎల్‌టిటిఇ ప్రాంతం నుంచి తప్పించుకుపోవడానికి ప్రయత్నించే వారి పట్ల ఆ తమిళ పోరాటకారులు చాలా క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించే సంగతి కూడ హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక దృష్టాంతాలతో సహా వివరించింది. ఫిబ్రవరి 9 నాడు సుదంతిరపురం వద్ద శ్రీలంక సైన్యం దాడి నుంచి తమను తాము కాపాడుకుంటూ వెనక్కి పోతున్న ఎల్‌టిటిఇ బలగాలు ఎప్పటిలాగే ప్రజలను కూడ తమతో బాటే వెనక్కు రమ్మని ఒత్తిడి పెట్టాయి. ఆ ఆదేశాన్ని తిరస్కరించి అక్కడే ఉండిపోవాలని చూసిన వారిపైన ఎల్‌టిటిఇ బలగాలు కాల్పులు జరిపి 17 మందిని చంపారు. గతంలో కూడ వన్ని ప్రాంతాన్ని వదిలి బయటికి పోవాలంటే ఎల్‌టిటిఇ అనుమతి తీసుకోవలసి ఉండింది. 2008 నుంచి ఆ అనుమతి పొందడం కష్టతరం అయింది. ఇప్పుడు అనుమతి ప్రసక్తి లేదు, నేరుగా కాల్చి చంపడమే జవాబు. ఫిబ్రవరి నెలలోనే ఒకరోజు యుద్ధ ప్రాంతానికీ సురక్షిత ప్రాంతానికీ అంచున ఉన్న మురసముద్దై అనే చోట ఇరుపక్షాలూ కాల్పులు జరుపుకుంటుండగా ఇటు వైపునుంచి అటు వైపు పారిపోవాలని చూసిన వారిపైన వెనుక నుంచి ఎల్‌టిటిఇ, ముందు నుంచి శ్రీలంక సైన్యం కాల్పులు జరిపాయి. ఎంత మంది చనిపోయిందీ తెలీదు.

పోనీ ధైర్యం చేసి ఎల్‌టిటిఇ ప్రాంతం నుంచి తప్పించుకున్న తమిళులు తర్వాతయినా సురక్షితంగా ఉంటారా అంటే అదేం లేదు. వారిని యుద్ధ ప్రాంతం సరిహద్దు నుంచి చివరి మజిలీ అయిన వావున్నియా పట్టణం చేరే లోపల అయిదు సార్లు సోదా చేస్తారు. అతి ముఖ్యమైన సోదా ఒమంతై చెక్‌పోస్ట్ దగ్గర జరుగుతుంది. అక్కడ 18–35 సంవత్సరాల మధ్య వయస్సున్న మగవాళ్లను వేరుచేసి మిగిలిన వాళ్లను వావున్నియా పంపిస్తారు. ఒమంతైలో నిలిపేసిన వారు మళ్ళీ కనిపించకపోవచ్చు. వావున్నియా చేరిన వారు కూడా ముళ్లకంచె, సైన్యం పహారాలోనే బతకాలి.

తమిళనాడు ప్రజలలో ఉన్న ఆగ్రహాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. కోపగించుకునే వారంతా ఎల్‌టిటిఇ మద్దతుదారులు కారు. నిజానికి ఎల్‌టిటిఇ ఒక ఫాసిస్టు సంస్థ అనేదే అత్యధికుల అభిప్రాయం. ఈ తేడా తెలియని జస్టిస్ శ్రీకృష్ణ తొందరపడి తయారుచేసిన తన మధ్యంతర నివేదికలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులందరినీ 'ఎల్‌టిటిఇ అనుకూలురు' అని మొదటి పేరాలోనే వర్ణించారు. అక్కడి నుంచే ఆ నివేదిక నిష్పాక్షికత కోల్పోయింది. తమిళనాడులో జనవరి నెలాఖరు నుంచి శ్రీలంక తమిళుల పట్ల సానుభూతితో రకరకాల రూపాలలో ఆందోళన నడుస్తున్నది. దానిలో లాయర్లు ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ నిన్న మొన్న పాకిస్థాన్‌లో జరిగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలోనూ లాయర్లు ముఖ్య పాత్ర నిర్వహించడాన్ని అందరూ గొప్ప విషయంగా భావించేటప్పుడు ఈ సంఘీభావ ఉద్యమంలో లాయర్ల పాత్రను జస్టిస్ శ్రీకృష్ణ, ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికల సంపాదకులూ ఈసడించుకోవడం ఎందుకు? ఈ లాయర్లు సమాజం అట్టడుగు వర్గాలకు చెందిన యువ న్యాయవాదులు కావడమే అందుకు కారణం అన్న విమర్శకు జవాబుందా?

ఆందోళన చేస్తున్న లాయర్లకు ఫిబ్రవరి 17న హైకోర్టుకు వచ్చిన సుబ్రమణ్యా స్వామి కనిపించాడు. వాళ్ల నినాదాలిచ్చుకుంటూ అతను కూర్చున్న కోర్టులోకి పోయి అతని పైన కోడిగుడ్లు విసిరారు. కోడిగుడ్ల సంగతి అటుంచి కోర్టు హాల్‌లో నినాదాలివ్వడం నిస్సందేహంగా తప్పే. అయినా సుబ్రమణ్యా స్వామి కోర్టులో నైనా బయటైనా కొట్టదగ్గ వ్యక్తి కాదు. భారత ప్రజా జీవితంలో ఏ అర్హతా లేకున్నా కేవలం మీడియా ప్రాపకం పుణ్యాన ప్రజాజీవితంలో బతికి వున్న నికృష్ట జీవులెవరయినా ఉంటే వారిలో ఇతను ప్రథముడు. అయినా లాయర్లు నినాదాలిచ్చుకుంటూ వెళ్లి అతనిపైన కోడిగుడ్లు విసరడం సెక్షన్ 147 ఐపిసి కింద మాత్రమే నేరం. అది బెయిలబుల్ నేరం. వారిని అరెస్టు చేయడానికి పోలీసులు యుద్ధం చేయవలసిన అవసరమేం ఉండలేదు. అయితే వారి నేరాన్ని నాన్ బెయిలబుల్ చేయడానికి కాబోలు సుబ్రమణ్యా స్వామిని వారు 'బ్రాహ్మణ శునకం' అని తిట్టారని చెప్పి సెక్షన్ 153– ఎ చేర్చారు. అతను ఎల్‌టిటిఇని ఉద్దేశించి ' ఇంటర్నేషనల్ పరయ్యా' అన్న తిట్టు వాడాడని ది హిందూ సైతం రాసింది. తమిళం నుంచి ఇంగ్లీష్‌లోకి పోయిన పరయ్యా అన్న మాటకు ఇంగ్లీష్‌లో వెలివేయబడిన వారు అన్న అర్థం మాత్రమే ఉండవచ్చు. ఎల్‌టిటిఇని అంతర్జాతీయంగా అందరూ వెలివేశారన్న అర్థంలో తాను ఆ మాట ప్రయోగించానని సుబ్రమణ్యా స్వామి సమర్థించుకోవచ్చు. కాని తమిళంలో పరయ్యా అనేది అంటరానితనాన్ని సూచించే మాట, ఒక తిట్టు కూడ. కాబట్టి అధికంగా దళితులయిన లాయర్లు అతని పైన ఎస్‌సి ఎస్‌టి కేసు పెట్టాలనడంలో తప్పేముంది?

18వ తేదీన లాయర్ల నాయకుడు ఇమ్మాన్యుయెల్‌ను పోలీసులు అరెస్టు చేసినప్పుడు గొడవేమీ కాలేదు. 19వ తేదీన తక్కిన లాయర్లు హైకోర్టు ఆవరణలో ఉన్న పోలీస్ స్టేషన్‌లోకి పోయి సుబ్రమణ్యా స్వామి పైన కేసు పెట్టి అరెస్టు చేస్తే తామూ అరెస్టవుతామనడంతో ఘర్షణ మొదలయింది. వాళ్ళను పోలీసులు బలవంతంగా వ్యాన్ ఎక్కించే ప్రయత్నంచేసేసరికి ఆందోళన చేస్తున్న లాయర్లు తిరగబడ్డారు. పోలీసుల పైన రాళ్లు వేశారు. పోలీస్ స్టేషన్‌కు నిప్పుపెట్టారు. పోలీసులు హైకోర్టు గేట్లు మేసి ఎదురుదాడికి దిగారు. సాయంత్రం 5. 15 కు నగర పోలీస్ కమిషనర్ వచ్చాడు. ఆ తరువాతే లాఠీచార్జికి అధికారికంగా ఆదేశం లభించిందని జస్టిస్ శ్రీకృష్ణ సహితం ఒప్పుకుంటున్నారు. ఆ ఆదేశం లభించిన పోలీసులు విపరీతమైన బీభత్సానికి పాల్పడ్డారు. కోర్టు లోపల, కోర్టు కార్యాలయాల లోపల, లైబ్రరీలో, చుట్టు పక్కల వీధులలో ఉండే లాయర్ల ఆఫీసులలో, జెరాక్స్ షాపులలో, హోటళ్లలో కనిపించిన ప్రతి లాయర్‌నూ కొట్టారు, కంప్యూటర్లను విరగ్గొట్టారు, కాగితాలు విసిరేశారు. భయపడిన జడ్జీలు చాలామంది టాయిలెట్లలో తలుపులు వేసుకున్నారంట. ఇరు పక్షాలను శాంతింపజేయడానికి వచ్చిన జడ్జి ఆర్ముగం పెరుమాళ్‌కు కూడా తల మీద లాఠీ దెబ్బ తగిలింది. పోలీస్ కమిషనర్ సమక్షంలోనే ఇవన్నీ జరిగినా అతని తప్పేమీ లేదని జస్టిస్ శ్రీకృష్ణ తన మధ్యంతర నివేదికలో అన్నారు. వారి తుది నివేదిక ఇంకొంచమైనా నిష్పాక్షికంగా ఉండాలంటే తమిళులు ఎందుకు ఆందోళన చెందుతున్నారో అర్థం చేసుకోవలసి ఉంటుంది. చేసుకుంటాడని ఆశిద్దాం.

> శ్రీలంక ఘటనలపై తమిళనాడులో కోపగించుకునే వారంతా ఎల్‌టిటిఇ మద్దతుదారులు కారు. నిజానికి ఎల్‌టిటిఇ ఒక ఫాసిస్టు సంస్థ అనేదే అత్యధికుల అభిప్రాయం. ఈ తేడా తెలియని జస్టిస్ శ్రీ కృష్ణ తొందరపడి తయారుచేసిన తన మధ్యంతర నివేదికలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులందరినీ 'ఎల్‌టిటిఇ అనుకూలురు' అని వర్ణించారు. అక్కడి నుంచే ఆ నివేదిక నిష్పాక్షికత కోల్పోయింది.